సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 14 । జూలై । 2023



పోటీలకు ఆదరణ అంతంతే

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఖమ్మంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలకు అంతంత మాత్రంగానే ఆదరణ లభించింది. IIలో



స్టడీ టూర్‌కు ప్రజాప్రతినిధులు

భద్రాద్రి జిల్లా ప్రజాప్రతినిధులు పలువురు స్టడీ టూర్ నిమిత్తం ఖమ్మం నుంచి గురువారం ఢిల్లీకి బయలుదేరారు. IIలో

గరిష్ఠం / కనిష్ఠం
35° / 26°

వాతావరణం

జిల్లా అంతటా శుక్రవారం వర్షం కురిసే అవకాశముంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదవుతుంది.

న్యూస్‌రీల్

పాలేరుకు చేరిన సాగర్ జలాలు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు గురువారం సాయంత్రం నాగార్జునసాగర్ డ్యాం నుంచి జలాలు చేరాయి. రిజర్వాయర్‌లో నీటిమట్టం 10అడుగులకు పడిపోగా, సాగర్ జలాల చేరికతో అది క్రమంగా పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యమైన 23 అడుగులకు చేర్చి తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. కాగా, సాగర్ జలాల విడుదలతో జిల్లాకు తాగునీటి ఇబ్బందులు తీరినట్లవుతోంది. నీటి పారుదలశాఖ డీఈఈ మధు నాయకన్‌గూడెంలోని ఎడమ కాల్వ ఇన్‌ఫాల్ రెగ్యులేటర్ వద్ద సాగర్ జలాలను పరిశీలించారు.

సత్తుపల్లికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: సత్తుపల్లికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరైంది. ఈమేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సాంకేతిక విద్యాశాఖకు ప్రభుత్వం నుంచి గురువారం ఉత్తర్వులు అందాయని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి రానుందని వెల్లడించారు. తద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపార. కాగా, కళాశాల మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే సండ్ర కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురు ఎక్సైజ్ సీఐల బదిలీ

- గుట్టుచప్పుడు కాకుండా స్థానచలనం

ఖమ్మంక్రైం: ఎక్సైజ్ శాఖలో మునుపెన్నడూ లేని విధంగా మొదలైన బదిలీలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల అండదండలతో సీఐలు కోరుకున్న చోట పోస్టింగ్ దక్కించుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. ఇందులో ఎక్సైజ్ ఉన్నతాధికారి ఒకరు చక్రం తిప్పినట్లు తెలుస్తుండగా, మద్యం సిండికేట్ పెద్దలు కూడా బదిలీలకు సహకరిస్తున్నారని సమాచారం. కాగా, గురువారం కూడా నలుగురు సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సత్తుపల్లి సీఐ రాంప్రసాద్‌ను ఇల్లెందుకు, అక్కడి సీఐ రాజశేఖర్‌ను సత్తుపల్లికి, ఖమ్మం ఎస్‌టీఎఫ్ విభాగం సీఐ పోశెట్టిని నేలకొండపల్లికి, అక్కడ పనిచేస్తున్న విజయేందర్‌ను ఖమ్మం ఎస్‌టీఎఫ్‌కు బదిలీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేసిన ఆయన మన ఊరు – మన బడి ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఆంగ్లం, భౌతికశాస్త్రం, హిందీ సబ్జెక్టుల్లో పలు ప్రశ్నలు అడిగి సామర్థ్యాలను పరీక్షించారు. ఆతర్వాత ఉపాధ్యాయులతో సమావేశమైన డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా పర్యవేక్షిస్తూ మెరుగైన బోధన చేయాలని సూచించారు. హెచ్‌ఎం పోటు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

19న డీ వార్మింగ్ డే



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మాలతి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని పిల్లలందరితో నులి పురుగుల నివారణ మాత్రలు మింగించాలని డీఎంహెచ్‌ఓ బి.మాలతి సూచించారు. ఖమ్మంలోని టీటీడీసీ మందిరంలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాలపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో మాలతి మాట్లాడుతూ 19న నిర్వహించే నేషనల్ డీవార్మింగ్ డే(ఎన్‌డీడీ)ను విజయవంతం చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటూ, సంబంధిత శాఖల అధికారుల సహకారం తీసుకోవాలని చెప్పారు. డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ రాజేంద్రసింగ్‌తో పాటు అధికారులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రమీల, డాక్టర్ సైదులు, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం మండలం వెలుగుమట్లలో మొలకెత్తిన పత్తి మొక్కలు



కలుపు తీస్తున్న మహిళలు



వర్షాలు కురవడంతో పత్తి మొక్కలకు ఎరువు వేస్తున్న రైతు



ప్రాణం వచ్చేసింది!

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి, మెట్ట పంటలకు ప్రాణం పోశాయి. విత్తనాలు మొలకెత్తకపోవడం, తడి జల్లులతో మొలకెత్తినా.. వర్షాభావంతో మొక్కలు వడబడుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఇంతలోనే కురిసిన వర్షం వారికి ఊరటనివ్వగా.. పంటలకు ప్రాణం పోసినట్లయింది. జిల్లావ్యాప్తంగా గురువారం సగటున 2.04 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక సగటు కాగా, భూమి పదునెక్కడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా, ఇప్పటివరకు జిల్లాలో అన్ని రకాల పంటలు కలిపి 1,75,945 ఎకరాల్లో సాగయ్యాయి. –సాక్షిప్రతినిధి, ఖమ్మం

రెండు రోజుల వర్షంతో పంటలకు పదును

- జిల్లాలో పత్తి, మెట్ట సాగు చేసిన రైతులకు ఊరట
- ఇప్పటివరకు 1,75,945 ఎకరాల్లో సాగు
- సగటున 2.04 సెం.మీ వర్షపాతం

పత్తి నెమ్మదిగా 'సాగు'తూ..

జిల్లాలో అన్నిరకాల పంటల సాగు లక్ష్యం 6.50 లక్షల ఎకరాలు కాగా, ఇందులో పత్తి 2,23,617 ఎకరాలకు గాను 1,11,693 ఎకరాల్లోనే సాగైంది. గత ఏడాది ఇదే సమయానికి రెండు లక్షల ఎకరాల్లో విత్తనాలు నాటారు. అయితే, గత నెలలో తీవ్ర వర్షాభావం పంట సాగుపై పడగా.. గత నెల చివరి వారం నుంచి నెమ్మదిగా సాగుతోంది. ఈ నెలలో కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు లేక పత్తి సాగు గణనీయంగా తగ్గినట్లయింది. దీంతో రైతులు ఇతర పంటలపై దృష్టి సారించారు. అయితే, ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తి.. వర్షాభావంతో మొలకెత్తని, జల్లులతో మొలకెత్తి వడబడుతున్న తరుణాన రెండు రోజులుగా కురుస్తున్న వర్షం రైతులను ఆదుకుంది. ఇప్పుడు కూడా వర్షం రాకపోతే పత్తి విత్తనాలు నేలలోనే కలిసేవని రైతులు చెబుతున్నారు.

వరి నార్లు ముమ్మరం

నాగార్జునసాగర్ నుంచి నీళ్లు విడుదలైతే జిల్లాలో వరి సాగు ఊపందుకునేది. కానీ కృష్ణా నది ఎగువన వర్షాలు లేకపోవడంతో సాగర్ నీటిమట్టం పడిపోగా, జిల్లాకు ఎప్పుడు సాగు నీళ్లు వస్తాయనేది వరుణుడి కరుణపై ఆధారపడి ఉంది. జిల్లాలో ఈ వానాకాలం వరి సాగు లక్ష్యం 2,89,983 ఎకరాలు కాగా.. బోర్లు, బావుల కింద వెదజల్లే పద్ధతి, నాట్లతో 9,946 ఎకరాల్లోనే వరి సాగైంది. ఇంకా 69,731 ఎకరాల్లో వరి నాటేందుకు రైతులు నార్లు పోశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికి వరి సాగు ప్రారంభించిన రైతులకు ఢోకా లేనట్లేనని చెప్పాలి. అయితే, ఈనెల లేదా వచ్చే నెలలో కురిసే వర్షాల ఆధారంగా సాగర్ నీళ్ల విడుదలయ్యే అవకాశం ఉంది. లేనిపక్షంలో సాగర్ ఆయకట్టులో వరి గణనీయంగా పడిపోయి మెట్ట పంటలు సాగవుతాయి. ఈనెల 20 వరకు పత్తి, అపరాల పంటలు సాగు చేసుకోవచ్చునని అధికారులు చెబుతుండడంతో ఆయా పంటల విస్తీర్ణం పెరిగే అవకాశముంది.

లోటు వర్షమే..

నైరుతి రుతుపవనాలు సకాలంలో ఆగమనం ప్రారంభమైతే జూన్‌లో జిల్లాలో సగటున 10.5 సెం.మీ. వర్షపాతం నమోదు కావాలి. కానీ ఈ జూన్‌లో 4.9 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా 52 శాతం లోటు ఏర్పడింది. జిల్లాలోని 19 మండలాల్లో తీవ్ర వర్షాభావం పంటల సాగుపై ప్రభావం చూపగా, ఈ నెలలో 27.2 సెం.మీ. సగటు వర్షపాతానికి గాను ఇప్పటి వరకు 8.3 సెం.మీ. నమోదైంది. ఇదే పరిస్థితి కొనసాగితే సాగు చేసిన పంటలు ఎండిపోవడం ఖాయమని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా, ఈ నెల ఇప్పటివరకు జిల్లాలోని కారేపల్లి, కామేపల్లి మినహా అంతటా లోటు వర్షపాతమే ఉంది.

ఊపిరి పోసినట్లయింది..



ఐదున్నర ఎకరాల్లో పత్తి సాగుకు తొలకరి జల్లులు పడగానే విత్తనాలు పెట్టాం. ఆతర్వాత పదిహేను రోజులు వానలే పడలేదు. దీంతో చాలా మొక్కలు ఎండిపోగా, మిగతావి కూడా ఎండిపోతాయని అనుకున్నాం. కానీ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి మొక్కలకు ప్రాణం పోశాయి. వాతావరణం చల్లబడి చిరుజల్లులు పడుతుండటంతో మొక్కలు ఏపుగా పెరుగుతాయి.
– జిడ్డ గోపాలుడు, ముష్టికుంట్ల, బోనకల్ మండలం

జిల్లాలో ఇప్పటి వరకు సాగైన పంటలు..

పంట	ఎకరాలు
వరి	9,946
పత్తి	1,11,693
పెసర్లు	5,384
మొక్కజొన్న	387
చెరకు	346
మిర్చి	39
ఇతర పంటలు	48,150
మొత్తం	1,75,945

గురువారం అత్యధిక వర్షపాతం నమోదైన మండలాలు..

మండలం	వర్షపాతం (సెం.మీ)
సత్తుపల్లి	11.3
కామేపల్లి	10.8
కారేపల్లి	9.1
ఏన్కూరు	4.7
పెనుబల్లి	4.2
వేంసూరు	3.0
కల్లూరు	2.2

బాధ్యతగా.. భారం పడకుండా!

- రూ.కోట్ల వ్యయాన్ని ఆదా చేసిన కేటీపీఎస్ ఇంజనీర్లు, కార్మికులు
- పాత ప్లాంట్ నుంచి రూ.లక్షతోనే ఆయిల్ సిస్టమ్ మార్పు
- ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు



ఇంజనీర్లను అభినందిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు



ఫ్యూయల్ ఆయిల్ సిస్టమ్

పాల్వంచ: ఇదే పని కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే కనీసం రూ.కోటి వ్యయమయ్యేది. కానీ కేవలం రూ.లక్షతోనే పూర్తిచేసిన పాల్వంచలోని కేటీపీఎస్ ఇంజనీర్లు అభినందనలు అందుకున్నారు. అంతేకాక ప్రస్తుతం చేసిన మార్పులతో ఏటా రూ.2కోట్ల వ్యయాన్ని ఆదా చేసినట్లయింది. ఈ మార్పులు ఏమిటి, నిధులు ఎందుకు మిగిలాయి, దీని వెనుక ఇంజనీర్ల కృషి ఏమిటో తెలుసుకోవాలంటున్నారా.. అయితే, ఈ కథనం చదవండి!

పాత ప్లాంట్ నుంచి ఇంధనం సరఫరా

తొలినాళ్లలో కేటీపీఎస్‌లోని ఓఅండ్‌ఎం(పాత ప్లాంట్)లో ఫ్యూయల్ ఆయిల్ సిస్టమ్(ఆయిల్ ఢీ కాంటింగ్) ఉండేది. కాలక్రమంలో వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5, 6వ దశల కర్మాగారాలు నిర్మించినా ప్లాంట్ మాత్రం ఏర్పాటుచేయలేదు. దీంతో పాత ప్లాంట్‌లోని సిస్టమ్ వద్దే ట్యాంకర్ల ద్వారా హెవీ ఫ్యూయల్ ఆయిల్, లైట్ డీజిల్ దిగుమతి చేసి మూడు కిలోమీటర్ల మేర పైపులైన్ల ద్వారా సరఫరా చేసేవారు. ఈ ఇంధనాన్ని విద్యుత్ ఉత్పత్తి చేసే సమయాన బాయిలర్లు మండించడానికి ఉపయోగిస్తారు. అయితే, పైపులైన్ల ద్వారా సరఫరా చేసే సమయంలో ఏటా 15 నుంచి 20శాతం (రూ.2కోట్ల విలువ) ఆయిల్ లీకేజీ, ఆవిరి రూపాల్లో వృథా అయ్యేది.

ప్రత్యామ్నాయం ఎలా?

కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారానికి ఫ్యూయల్ ఆయిల్ సిస్టమ్(ఆయిల్ ఢీ కాంటింగ్)ను తరలించాలని ఉన్నతాధికారులు యోచన చేశారు. ఈ పనిని ఏ కాంట్రాక్టర్‌కు అప్పగించినా కనీసం రూ.కోటి మేర బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చర్చలు జరుగుతుండగానే ఇంజనీర్లు, కార్మికులు పని తామే చేస్తామని ముందుకొచ్చారు. పాత ప్లాంట్‌లోని సిస్టమ్‌ను పరిశీలించి కొత్త ప్లాంట్‌లో ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాక రంగంలోకి దిగారు. ఫ్యూయల్స్ అండ్ ఆయిల్స్ డివిజన్ ఇంజనీర్లు, కార్మికులు కలిసి 40 రోజుల పాటు కష్టపడి స్వయంగా ప్లాంట్‌ను మార్చారు. ఈ పనంతా పూర్తి చేయడానికి కేవలం రూ.లక్ష మాత్రమే ఖర్చయింది. అంటే కాంట్రాక్టర్‌కు పని అప్పగిస్తే చెల్లించాల్సిన రూ.99లక్షలు మిగలగా, ఇంధనం ఆవిరి, లీకేజీల ద్వారా ఏటా వృథా అయ్యే రూ.2కోట్లు మిగలనుండడంతో ఇంజనీర్లు, కార్మికులపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రశంసాపత్రాలు అందించిన సీఈ

ఎక్కడాలేని విధంగా పాత ప్లాంట్‌లోని ఫ్యూయల్ ఆయిల్ సిస్టమ్‌ను తొలగించి 5, 6వ దశల కర్మాగారంలో ఏర్పాటుచేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఈ(సీహెచ్‌పీ) పి.కృష్ణ, డీఈ(ఎఫ్‌అండ్‌ఓ) పి.కృష్ణయ్య, ఏడీఈ నాగచంద్ర, ఏఈయు.కోటేశ్వరరావు, ఎన్.భరత్ తదితరులను సీఈ ఎం.ప్రభాకర్ రావు గురువారం అభినందించి ప్రశంసాపత్రాలను అందించారు. అలాగే, ఎఫ్‌అండ్‌ఓ డివిజన్ ఇంజనీర్లు, కార్మికులు, ఆర్టిజన్లను కూడా అభినందించారు. ఎస్‌ఈ(ఏడీఎం) వి.వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ ఆఫీసర్ భాగం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

- వర్షాల కారణంగా ఓసీల్లోకి చేరిన నీరు
- ఓబీ వెలికితీతకు కూడా బ్రేక్

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లి : కొత్తగూడెం సింగరేణి రీజియన్ పరిధిలోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో బొగ్గు ఉత్పత్తి అంతరాయం ఏర్పడింది. రీజియన్‌లోని ఓపెన్‌కాస్ట్ గనుల్లో సుమారు 61 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లిందని అధికారులు వెల్లడించారు. అలాగే, సుమారు 3.90 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీతకు విఘాతం ఏర్పడింది. రీజియన్‌లోని ఇల్లెందులో 9వేల టన్నులకు 3వేల టన్నులు, మణుగూరు ఏరియాలో 40 వేల టన్నులకు 10 వేల టన్నులు, కొత్తగూడెం ఏరియాలో 37 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 12వేల టన్నుల ఉత్పత్తి నమోదైందని అధికారులు తెలిపారు. అలాగే, రీజియన్‌లో 4.60 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత నిలిచిపోయింది. కాగా, ఎడతెరిపి లేని వర్షంతో క్వారీలోని హాల్ రోడ్లు బురదమయంగా మారగా.. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది.



కొత్తగూడెంలోని జీకే ఓసీలోకి చేరిన వర్షపు నీరు

సామగ్రి తిరిగి తీసుకురండి...

ఆదేశించిన డీఆర్‌డీఓ విద్యాచందన

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి పాత కార్యాలయంలో మాయమైన సామగ్రిని తిరిగి ఇవ్వాలని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన ఆదేశించారు. కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు తరలించే సమయాన పలు సామగ్రి మాయమైన విషయమై ఈనెల 11న 'సాక్షి'లో 'డీఆర్‌డీఏలో దొంగలు పడ్డారు' శీర్షికన ప్రచురితమైన కథనంతో ఆమె స్పందించారు. ఇప్పటికే పాత కార్యాలయంలో ఉన్న సామగ్రి, కొత్త కార్యాలయంలోని సామగ్రిని రికార్డుల ఆధారంగా తనిఖీ చేసిన డీఆర్‌డీఓ ఏమేం కనిపించడం లేదో నివేదిక ఇవ్వాలని ఏఓకు సూచించారు. ఇక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, సిబ్బందిని పిలిపించి సామగ్రిని స్వచ్ఛందంగా తిరిగి తీసుకురావాలని ఆదేశించారని సమాచారం. అయితే, ఇప్పటికే కొన్ని సామన్లను బయట విక్రయించిన వారు వేరేవి తీసుకొచ్చి పెడుతున్నట్లు తెలిసింది.

రేపటి నుంచి రూ.లక్ష చెక్కుల పంపిణీ

కలెక్టర్ల వీసీలో మంత్రి కమలాకర్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: బీసీల్లోని కుల, చేతివృత్తుల వారికి ఈనెల 15నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీ ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. కరీంనగర్ నుంచి ఆయన వీసీ ద్వారా జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కమలాకర్ మాట్లాడుతూ బీసీ కులవృత్తులు, చేతి వృత్తుల వారికి అండగా నిలిచేందుకు సీఎం కేసీఆర్ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారని చెప్పారు. గతనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 300 మందికి ఈనెల 15నుంచి చెక్కులు పంపిణీ చేయాలని సూచించారు. ఈవిషయంలో అర్హులు ఎలాంటి అపోహలకు లోను కాకుండా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం మాట్లాడి సూచనలు చేశారు. వీసీలో జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ గత నెల 20వ తేదీ వరకు 26,451 దరఖాస్తులు అందగా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టామని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జ్యోతి పాల్గొన్నారు.

ఎన్నికల పని మొదలు!

- ఆర్‌ఓ, ఏఆర్‌ఓలను నియమించిన ఎన్నికల కమిషన్
- ఉమ్మడి జిల్లాలో పది మంది ఆర్వోలు, 50 మంది ఏఆర్వోల నియామకం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వస్తాయో స్పష్టంగా తెలియకున్నా ముందస్తు ఏర్పాట్లపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ఇప్పటికే ఓటర్ల జాబితాల తయారీ, సవరణతో పాటు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను గురువారం నియమించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాలకు గాను రిటర్నింగ్ అధికారులుగా పది మందితో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా 50 మందిని నియమించారు.

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు వీరే..

ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారులతో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు కీలకంగా వ్యవహరించనున్నారు. ఇందుకు గాను ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలకు గాను 50 మందిని ఏఆర్వోలను నియమించారు. ఖమ్మం నియోజకవర్గానికి ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం తహసీల్దార్లు, ఖమ్మం కార్పొరేషన్‌లోని డిప్యూటీ సిటీ ప్లానర్, అసిస్టెంట్ కమిషనర్లను నియమించారు. పాలేరుకు ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి తహసీల్దార్లు, మధిర నియోజకవర్గానికి మధిర, బోనకల్, చింతకాని, ముదిగొండ, ఎర్రుపాలెం తహసీల్దార్లు, వైరా నియోజకవర్గానికి వైరా, కొణిజర్ల, సింగరేణి, ఏన్కూరు, జూలూరుపాడు తహసీల్దార్లు, సత్తుపల్లి నియోజకవర్గానికి సత్తుపల్లి, కల్లూరు, వేంసూరు, తల్లాడ, పెనుబల్లి తహసీల్దార్లను నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అలాగే, కొత్తగూడెం నియోజకవర్గానికి కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ తహసీల్దార్లు, అశ్వారావుపేట నియోజకవర్గానికి అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ తహసీల్దార్లు, భద్రాచలం నియోజకవర్గానికి భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు తహసీల్దార్లు, పినపాక నియోజకవర్గానికి మణుగూరు, పినపాక, అశ్వాపురం, బూర్గంపాడు, గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం తహసీల్దార్లు, ఇల్లెందు నియోజకవర్గానికి ఇల్లందు, టేకులపల్లి, కామేపల్లి, గార్ల తహశీల్దార్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమితులయ్యారు.

నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులు వివరాలు

నియోజకవర్గం	అధికారి / హోదా
ఖమ్మం	కేఎంసీ కమిషనర్
పాలేరు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్‌ఏ) ఐటీటీ, రైల్వేస్, ఖమ్మం
మధిర	ఆర్డీఓ, ఖమ్మం
వైరా	అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఖమ్మం
సత్తుపల్లి	ఆర్డీఓ, కల్లూరు
కొత్తగూడెం	ఆర్డీఓ, కొత్తగూడెం
అశ్వారావుపేట	అదనపు కలెక్టర్ (రెవెన్యూ), భద్రాద్రి కొత్తగూడెం
భద్రాచలం	ఆర్డీఓ, భద్రాచలం
పినపాక	ఐటీడీఏ పీఓ, భద్రాచలం
ఇల్లెందు	ఎస్‌డీసీ (ఎల్‌ఏ), ఆర్‌డీఎల్‌ఐఎస్, ఐఎస్‌ఆర్‌ఎల్‌ఐఎస్ యూనిట్–1, పాల్వంచ

క్లుప్తంగా

రిఫరీ శిక్షణకు ఉషా కోచ్


పరిపూర్ణాచారి

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఉషా శిక్షణ ఇస్తున్న పి.పరిపూర్ణాచారి జాతీయస్థాయి రిఫరీ ట్రైనింగ్‌కు ఎంపిక య్యారు. ఈనెల 17నుంచి 22వ తేదీ వరకు జార్ఖండ్‌లోని సరళా బిర్లా యూనివర్సిటీలో ఈ ట్రైనింగ్ జరగనుంది. గతంలోనూ నాలుగు సార్లు రిఫరీ ట్రైనింగ్‌కు హాజరైన చారి మరోమారు ఎంపిక కావడంపై పలువురు అభినందించారు.

సీపీని కలిసిన సీఐలు

ఖమ్మంక్రైం: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మధిర సీఐగా వసంత్‌కుమార్, సిటీ స్పెషల్ బ్రాంచ్ సీఐగా శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు వారు గురువారం ఖమ్మంలో సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఓబీ తొలగింపు లక్ష్యాన్ని పూర్తిచేయాలి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో ఓవర్ బర్డెన్(ఓబీ) తొలగింపు లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేయాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు సూచించారు. ఈమేరకు ఓసీని గురువారం పరిశీలించిన ఆయన పీఓ వెంకటాచారి, అధికారులు, కంపెనీ బాధ్యులతో సమావేశమయ్యారు. వార్షిక లక్ష్యంలో వెనుకబడినందున ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకోసం సరిపడా యంత్రాలు, కార్మికులను సమకూర్చుకోవాలని తెలిపారు. ఓవర్ బర్డెన్ లక్ష్యం మేరకు తొలగిస్తే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కూడా మెరుగ్గా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో అధికారులు, కాంట్రాక్టు బాధ్యులు మధుసూదన్, రమణారెడ్డి, దేవదాస్, శ్రీనివాస రెడ్డి, శివయ్య పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. ఫిజికల్ సైన్స్(ఎంపీసీ, ఎంపీసీఎస్, డేటా సైన్స్), లైఫ్ సైన్సెస్(బీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, బీజెడ్‌సీఎస్), బీకాం(సీఏ), బీకాం(జనరల్), బీఏ(సీబీసీఎస్) కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశముందని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో రూ.200 చెల్లించి ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన జీఆర్పీ సిబ్బంది గురువారం గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన జనార్దన్ లుదికేశ్వర్‌నాయక్ ఈనెల 12వ తేదీన గంజాయితో ఖమ్మం చేరుకున్నాడు. ఈమేరకు గురువారం ఆయన ముంబై వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు రాగా, పోలీసులు తనిఖీ చేయడంతో రూ.1.60లక్షల విలువైన గంజాయి లభించింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని ఆయనను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. తనిఖీల్లో ఎస్‌ఐ భాస్కర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ ఆళ్ల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిప్పంటుకుని మహిళకు తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన మహిళ లక్ష్మి వంట చేస్తుండగా గ్యాస్ లీకై చీరకు మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. రోజుమాదిరిగానేఆమె వంట చేస్తుండగా మంటలు అంటుకోవడంతో లక్ష్మి కేకలు వేసింది. దీంతో కుటుంబీకులు మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

టాస్క్ పేరుతో ఎర.. రూ.1.35లక్షలు స్వాహా

ఖమ్మంఅర్బన్: ఖమ్మం యూపీహెచ్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి యడ్ల వినయ్ టాస్క్‌ల పేరుతో జరిగిన మోసంలో రూ.1.35 లక్షలు కోల్పోయాడు. ఈనెల 6న వినయ్ సెల్‌ఫోన్‌కు ఒక మెసేజ్ వచ్చింది. టాస్క్‌లు చేస్తే ఆదాయం వస్తుందని నమ్మబలకడంతో ఆయన రూ.2వేలతో మొదలుపెట్టగా కొంత నగదు వచ్చింది. దీంతో ఆయన మూడు దఫాల్లో రూ.1.35లక్షలు డిపాజిట్ చేస్తే తిరిగి రాకపోగా, ఫోన్ చేస్తే ఎదుటి వారు స్పందించలేదు. ఈమేరకు మోసపోయినట్లు గుర్తించిన వినయ్ చేసిన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

చుక్కల దుప్పికి తీవ్రగాయాలు

సత్తుపల్లిటౌన్: జనావాసాల్లోకి వచ్చేందుకు సత్తుపల్లి అర్బన్ పార్కు ప్రహరీ దూకిన ఓ దుప్పికి తీవ్ర గాయాలయ్యాయి. పార్కులో ఉంటున్న నాలుగేళ్ల వయస్సు చుక్కల దుప్పి గురువారం సాయంత్రం వెంగళరావునగర్ కాలనీ వైపు గోడ దూకింది. ఈఘటనలో దుప్పికి తీవ్రగాయాలు కాగా, స్థానికులు అటవీశాఖ ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎఫ్‌బీఓ ముక్తి వెంకటేశ్వర్లు వెటర్నరీ వైద్యులతో చికిత్స చేయించి పాల్వంచలోని కిన్నెరసాని అభయారణ్యానికి తరలించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,623

దంచికొట్టిన వాన

- సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో ముంచెత్తిన వరద
- పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం దంచికొట్టింది. సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో ఈ ప్రభావం ఎక్కువగా కనిపించింది. సత్తుపల్లిలో గురువారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం పడటంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో అంతర్గత వీధులు, డ్రెయినేజీలు, ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లోకి నీరు చేరింది. ఇక తల్లాడ మండలం బిల్లుపాడు–రామచంద్రాపురం మధ్య వాగు పొంగి ప్రవహించింది. ఎగువన పడిన వర్షం కారణంగా వాగు ఉధృతంగా ప్రవహించడంతో రహదారిపైకి నీరు చేరగా కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే, పెనుబల్లి మండల వ్యాప్తంగా జోరువాన కురిసింది. వీఎం బంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వర్షపు నీరు చేరడంతో చెరువును తలపించింది. వర్షపు నీటిని బయటకు పంపేందుకు ఉపాధ్యాయులు పారలు చేత బట్టి కాలువలు తీశారు. కాగా, ఏన్కూరు, కారేపల్లి మండలాల్లో కూడా వర్షపాతం నమోదైంది. ఏన్కూరు మండలం నాచారం – రేపల్లెవాడ గ్రామాల మధ్య వాగుకు వరద పోటెత్తడంతో రహదారిపైకి నీరు చేరగా ఎస్‌ఐ రవి, తహసీల్దార్ ముజాహిద్ ఆధ్వర్యాన రాకపోకలు నిలిపివేశారు.

– సత్తుపల్లి టౌన్ / సత్తుపల్లి రూరల్ / తల్లాడ / పెనుబల్లి / ఏన్కూరు / కారేపల్లి


పెనుబల్లి : వీఎం బంజర్ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలోకి చేరిన నీరు


ఏన్కూరు : నాచారం - రేపల్లెవాడ మధ్య ప్రవహిస్తున్న వాగు


కారేపల్లి : మద్దులవాగు వద్ద చేపలు పడుతున్న యువకులు


సత్తుపల్లి టౌన్ : కాకర్లపల్లి రోడ్డుపై గాడిదల వాగు వరద


సత్తుపల్లి టౌన్ : ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు


సత్తుపల్లి రూరల్ : గంగారం ప్రకాష్‌నగర్ కాలనీలో ముంచెత్తిన వరద


సత్తుపల్లి రూరల్ : సత్తుపల్లి మండలంలో పంట కాల్వల్లో నీరు


తల్లాడ : బిల్లుపాడు - రామంచంద్రాపురం మధ్య ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు

స్టడీ టూర్‌కు వెళ్లిన జిల్లా ప్రజాప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజాప్రతినిధులు స్టడీ టూర్ కోసం ఢిల్లీ వెళ్లారు. ఈమేరకు గురువారం వారు ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ బయలుదేరగా, ఈనెల 17వరకు అక్కడి చారిత్రక ప్రదేశాలను సందర్శించనున్నారు. అలాగే, ఎంపీ నామా నేతృత్వంలో పలువురు కేంద్ర మంత్రులను కలిసి అభివృద్ధి పనులపై వినతిపత్రాలు ఇస్తారు. ఢిల్లీ వెళ్లిన వారిలో భద్రాద్రి డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుతోపాటు వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు మండే వీరహన్మంతరావు, బోయినపల్లి సుధాకర్‌రావు, బండి పుల్లారావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్మూర్తి, మంతపురి రాజుగౌడ్, దారా వెంకటేశ్వరరావు, కొట్టి వెంకటేశ్వరరావు, మోరంపూడి అప్పారావు, పైడి వెంకటేశ్వరరావు, బరపాటి వాసుదేవరావు, భరత లాలమ్మ, భరత రాంబాబు, భరత లాస్యశ్రీ, సయ్యద్ రసూల్, జల్లేపల్లి శ్రీరామ్మూర్తి, మేడి సరస్వతి, నాగమణి, భూక్యా సోనా, భూక్యా బాలాజీ, పాయం లలిత, సున్నం ప్రసాద్, సోయం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి అనస్తీషియన్ల రాష్ట్ర స్థాయి సదస్సు


సదస్సు వివరాలు వెల్లడిస్తున్న కిషన్‌రావు

ఖమ్మంఅర్బన్: అనస్తీషియన్(మత్తు డాక్టర్లు)ల రాష్ట్ర స్థాయి సదస్సును ఖమ్మంలో నిర్వహించనుండగా, ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఖమ్మంలోని మమత మెడికల్ కళాశాల డెంటల్ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 15, 16వ తేదీల్లో సదస్సు జరుగుతుందని ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ భాగం కిషన్‌రావు తెలిపారు. ఈ సదస్సులో 800 మంది వైద్య విద్యార్థులు పాల్గొననుండగా, ఇప్పటికే 500మందిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలోని 50మంది వైద్యులు పాల్గొని అనస్తీషియా రంగంలో వచ్చిన మార్పులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కాగా, రాష్ట్ర స్థాయి సదస్సులో భాగంగా శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కిషన్‌రావు వెల్లడించారు. సదస్సును విజయవంతం చేసేందుకు తనతోపాటు టి.సురేష్, కె.రవి, కిరణ్, విజయ, కోటేశ్వరరావు, విజయ, యశోద, జె.సురేష్, అనూషతో కమిటీలు ఏర్పాటుచేశామని తెలిపారు. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు ఖమ్మంలో రాష్ట్ర స్థాయి సదస్సు ఏర్పాటుచేయగా మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో టి.సురేష్, కె.రవి, కిరణ్, కోటేశ్వరరావు, విజయ పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట విద్యార్థి, యువజన సంఘాల ధర్నా


ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న డీఈఓ


పాఠశాల ఆర్చీని ధ్వంసం చేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట విద్యార్థి, యువజన సంఘాల నాయకులు గురువారం ధర్నాకు దిగారు. ఈసందర్భంగా ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ, పీఓడబ్ల్యూ తదితర సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, నామాల ఆజాద్, ప్రవీణ్, మస్తాన్, రామకృష్ణ, బషీరుద్దీన్, పోటు కళావతి, శిరోమణి తదితరులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహిస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఈమేరకు పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్‌తో ఆందోళన చేపట్టగా, తొలుత ఎంఈఓ వచ్చి సర్దిచెప్పినా వారు ససేమిరా అన్నారు. చివరకు డీఈఓ సోమశేఖరశర్మ చేరుకుని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ఆందోళన సందర్భంగా పాఠశాల ఆర్చీ, బోర్డును వారు ధ్వంసం చేశారు. ఈ ఆందోళనలో లక్ష్మణ్, యువరాజు, శివ, చందులాల్, వీరేందర్, సాయి దీపిక, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, విద్యార్థి సంఘాలు చేసిన ఆరోపణలపై విచారణ జరిపి గురువారం నివేదిక ఇవ్వాలని ఎంఈఓను డీఈఓ ఆదేశించారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి


సభ్యత్వాలు అందజేస్తున్న రంగారావు

మధిర: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యా య పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు డిమాండ్ చేశారు. మండలంలో పలు పాఠశాలల్లో గురువారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోగా, కనీసం విద్యావలంటీర్లను కూడా నియమించడం లేదన్నారు. తద్వారా విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. ఇకనైనా కోర్టు కేసులు పరిష్కారమయ్యేలా ప్రభుత్వం చొరవతీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డితో పాటు షేక్ మదార్, ఆర్.బ్రహ్మారెడ్డి, రవికుమార్, కిరణ్‌కుమార్, శాంతబాబు, పిల్లి నర్సింహారావు, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పురం సంగారావు తదితరులు పాల్గొన్నారు.

'స్పోర్ట్స్ స్కూల్' పోటీలకు ఆదరణ అంతంతే..

ఖమ్మం స్పోర్ట్స్: స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించేందుకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో కొనసాగుతున్నాయి. అయితే, మండల స్థాయి అధికారులు సరిగ్గా స్పందించకపోవడంతో గురువారం పోటీలకు విద్యార్థులు నామమాత్రంగానే హాజరయ్యారు. రెండు రోజులు జరిగిన పోటీలకు మొత్తం 150 మంది హాజరు కాగా, ఎక్కువగా తల్లిదండ్రులతో వచ్చిన వారే ఉండడం గమనార్హం. కాగా, 4, 5వ తరగతుల్లో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నామని డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు. పోటీల నిర్వహణలో కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, పీఈటీలు సుధాకర్, కృష్ణయ్య, ఇర్ఫాన్, దుర్గ పాల్గొన్నారు.


800 మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

నేలకొండపల్లి లైబ్రరీ భవనానికి రూ.53.60 లక్షలు


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమామహేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: గ్రంథాలయాల్లో అనేక ఏళ్లుగా పోయిన పుస్తకాల సమస్యను పరిష్కరించాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ కమిటీ నిర్ణయించింది. ఈమేరకు ఖమ్మంలోని జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు గ్రంథాలయాల్లో పోయిన పుస్తకాల విషయమై ఇబ్బంది పడుతుండగా పరిష్కారంపై చర్చించారు. అలాగే, నేలకొండపల్లి శాఖ గ్రంథాలయానికి రూ. 53.60 లక్షలతో నూతన భవనం, ఉద్యోగులకు రుణ మంజూరుకు ఆమోదం తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సభ్యులు మగ్బుల్, వెంకటేశ్వర్లు, అశోక్, సంస్థ కార్యదర్శి వి.అర్జున్, వయోజన విద్య సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' గుంతలో దిగబడిన పాఠశాల బస్సు

విద్యార్థులకు తప్పిన ప్రమాదం



బస్సును బయటకు లాగుతున్న స్థానికులు

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు వద్ద రోడ్డు పక్కనే ఉన్న మిషన్ భగీరథ గుంతలో పాఠశాల బస్సు దిగబడింది. ఈ సమయాన బస్సులో విద్యార్థులు ఉన్నా పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నెల క్రితం మిషన్ భగీరథ పైప్‌పగిలిపోవడంతో గుంత తీసి మరమ్మతులు చేశారు. కానీ ఆ తర్వాత గుంత పూడ్చకపోవడంతో ఆ గుంత కాస్తా పెద్దదై మడుగులా మారింది. ఈవిషయమై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా ఖమ్మంకు చెందిన ప్రైవేట్ పాఠశాల నుంచి గురువారం 25మంది పిల్లలతో మునగేపల్లికి వెళ్తున్న బస్సు తల్లంపాడులో రహదారి వెంటే ఉన్న గుంతలో దిగబడింది. దీంతో పిల్లలు భయంతో కేకలు వేయగా స్థానికులు చేరుకుని పిల్లలను కిందకు దించారు. డ్రైవర్ అదుపు చేయకపోతే బస్సు పల్టీ కొట్టేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను వెంటనే పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అదుపు తప్పి లారీబోల్తా

పెనుబల్లి : పాత ఇనుము లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి మండలంలోని వీఎం బంజర్ రింగ్‌సెంటర్ వద్ద బోల్తా కొట్టింది. సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు పాత ఇనుము లోడ్‌తో వెళ్తున్న లారీ గురువారం తెల్లవారుజామున బస్టాండ్ వైపు బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆ సమయానికి ఇతర వాహనాలేవీ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. కాగా, రింగ్ సెంటర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున అధికారులు నియంత్రణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


హసన్ అలీ(ఫైల్)

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. షీ టీం హెడ్ కానిస్టేబుల్‌గా హసన్ అలీ(53) రాపర్తినగర్‌లో నివాసముంటున్నాడు. బుధవారం ఇంట్లో ఉండగా మధ్యాహ్నం ఆయనకు గుండెపోటు వచ్చింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రి తరలించేలోగా మృతి చెందారు. ఈమేరకు హసన్‌అలీ మృతదేహం వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

కారేపల్లి: మానసిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని సూర్యతండా గ్రామానికి చెందిన మాలోతు సందీప్(29)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరగగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్లుగా ఆయన మానసిక స్థితి బాగా లేకపోవడంతో ఈనెల 10వ తేదీన చేనుకు వెళ్లి పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఘటనపై అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రామారావు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా వాసి..

పెనుబల్లి: ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో తీవ్రగాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన షేక్ కరీముల్లా ఈ నెల 2వ తేదీన ఆదివారం రాత్రి ముత్తగూడెంలోని రెస్టారెంట్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ముత్తగూడెం ఆర్టీఓ చెక్ పోస్టు ఎదురుగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడగా తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆయనను 108లో తిరువూరు ఆస్పత్రికి, అక్కడి నుంచి మంగళగిరికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు వీఎంబంజర్ ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జహీర్‌పురకు చెందిన కొంపల్లి నరేష్(40) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుండగా బుధవారం సాయంత్రం ఆయన భార్యతో గొడవ పడి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో గురువారం గాలిస్తుండగా శ్రీనివాస్‌నగర్‌లో చెట్టుకు ఉరి వేసుకుని ఉండగా గుర్తించారు. ఈమేరకు సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు చేరుకుని మృతదేహన్ని మార్చురీకి తరలించగా, నరేష్ సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

నేటితో ముగియనున్న 'దోస్త్' రిజిస్ట్రేషన్లు

మధిర: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు 'దోస్త్' ద్వారా రెండో దశ సీట్ల కేటాయింపు, మూడో దశ రిజిస్ట్రేషన్ శుక్రవారంతో ముగుస్తుందని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని డిగ్రీలో ప్రవేశాలు పొందాలని సూచించారు. ఈమేరకు దోస్త్ మధిర కళాశాలలో ప్రవేశాల కోసం 99482 49696, 94417 86508 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కష్టపడి చదివితే మంచి ఫలితాలు

మధిర: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని ట్రెయినీ ఐపీఎస్ అధికారి అవినాష్‌కుమార్ అన్నారు. మధిరలోని సీపీఎస్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఆంగ్లంపై పట్టు సాధిస్తే ఉపాధికి ఢోకా ఉండదని తెలిపారు. గతేడాది ఎస్సెస్సీలో 95 శాతం ఉత్తీర్ణత నమోదు కావడంపై ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రభుదయాళ్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

● యంగ్ టాలెంట్

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది ఢిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. ఢిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.

సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'


సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాళీ కాళీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

● ఇంగ్లిష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.

● సక్సెస్ స్టోరీ


తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్



స్టార్ ఫ్యాషన్ డిజైనర్

ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతి వృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్‌ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకళాకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ ప్రాజెక్ట్ 'అంబ' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

● టెక్.. టాక్



హువావే నోవా 11 ప్రో

● డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ● రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ ● బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ ● ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ ● ర్యామ్: 8జీబి ● రిజల్యూషన్: 1200x2652 పిక్సెల్స్ ● ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి ● ఆపరేటింగ్ సిస్టమ్: హామని ఓఎస్ ● బరువు: 188 గ్రా. ● కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్



నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్

● డిస్‌ప్లే: 1.4 అంగుళాలు ● ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ ● హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● 120 స్పోర్ట్స్ మోడ్స్ ● బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్వాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16x10x4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్
మెటీరియల్: అల్యూమినీయం
బరువు: 240 గ్రా.



గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...

ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లేఔట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

● గేమింగ్: నేడే విడుదల



వస్తున్నారహో!

ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్‌ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్న వాకౌట్


పూజా హెగ్డే
రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి, పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెరపై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగవంశితో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశి, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.


అనుష్కా శర్మ


కియారా అద్వానీ

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.


మీనాక్షీ చౌదరి
శ్రీలీల


కత్రినా కైఫ్


ప్రియాంకా చోప్రా

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.


ఆలియా భట్


'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.


విజయ్ సేతుపతి

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ


అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.

మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్


సయ్యద్ సోహైల్, రూపా కొడవాయుర్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయుర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. ''ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

- ఉదయనిధి స్టాలిన్



''నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది'' అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తీ సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ-''తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను'' అన్నారు.

క్లుప్తంగా...



జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ

తాత్కాలిక సీజేగా జస్టిస్ నవీన్‌రావు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపై వెళ్తున్న నేపథ్యంలో తదుపరి సీనియర్ జడ్జి జస్టిస్ నవీన్‌రావును తాత్కాలిక సీజేగా నియమిస్తూ కేంద్రం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే శుక్రవారం జస్టిస్ నవీన్‌రావు పదవీ విరమణ ఉండటంతో.. అనంతరం ఆ బాధ్యతలు తదుపరి సీనియర్ జడ్జి అయిన జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ నిర్వహిస్తారని పేర్కొంది. కొత్త సీజే బాధ్యతలు స్వీకరించే వరకు జస్టిస్ షావిలీ హైకోర్టు యాక్టింగ్ సీజేగా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. ఇదిలాఉండగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.

జస్టిస్ లలిత, జస్టిస్ రమేశ్ బదిలీకి రాష్ట్రపతి ఆమోదం



జస్టిస్ కన్నెగంటి లలిత జస్టిస్ డి. రమేష్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత కన్నెగంటి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేశ్‌ల బదిలీకి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేశారు. ఏపీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ డి.రమేశ్‌ను, తెలంగాణ హైకోర్టు నుంచి కర్ణాటక హైకోర్టుకు జస్టిస్ లలిత కన్నెగంటిని బదిలీ చేయాలంటూ గత ఏడాది నవంబర్ 24న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన విషయం విదితమే. ఈ సిఫార్సును గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ట్వీట్ చేశారు. అలాగే ఈ అంశంపై న్యాయ మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

కోర్టు ఆర్డర్ తెలియదంటే నమ్మాలా?

- ఆదివారం అంత అర్జెంట్‌గా ఎందుకు కూల్చాల్సి వచ్చింది?
- స్టే ఇచ్చిన తర్వాత కూడా ఎలా కూల్చివేశారు?
- జీహెచ్‌ఎంసీ మాజీ కమిషనర్ లోకేశ్‌పై హైకోర్టు ప్రశ్నల వర్షం
- డెక్కన్ కిచెన్ కూల్చివేత అంశంపై సాగిన విచారణ

సాక్షి, హైదరాబాద్: డెక్కన్ కిచెన్ కూల్చివేతపై స్టే ఉన్న విషయం మీకు తెలియదంటే నమ్మాలా.. ఆదివారం అంత అత్యవసరంగా ఎందుకు కూల్చాల్సి వచ్చింది.. సామాన్యులు, పలుకుబడి ఉన్న వారి విషయంలో ఒకేలా వ్యవహరిస్తున్నారా.. స్టే ఇచ్చిన తర్వాత కూడా ఎలా కూల్చివేస్తారు.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఎందుకు పాటించలేదు.. ఇప్పటివరకు ఆదివారం రోజున ఎన్ని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.. అంటూ జీహెచ్‌ఎంసీ మాజీ కమిషనర్ లోకేశ్ కుమార్‌పై హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. ఆ కూల్చివేత కోర్టు ధిక్కరణే అవుతుందని ప్రాథమికంగా భావిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ అంశంపై కోర్టుకు బేషరతుగా క్షమాపణ చెప్పిన లోకేశ్.. కోర్టు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 'కోర్టు స్టే ఉత్తర్వులు ఉన్న విషయం తెలియదు. నగరంలోని అక్రమ కట్టడాల కూల్చివేత ప్రతి రోజూ చేపడుతాం. వేలాది అక్రమ కట్టడాలను కూల్చివేశాం. భద్రతా చర్యలు అవసరం అనుకుంటే పోలీసుల సాయం కోరతాం. డెక్కన్ కిచెన్ ప్రాంతంలో ఇతర రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది.. అందుకే ఆదివారం కూల్చివేత పనులు చేపట్టాం. కోర్టు ఉత్తర్వుల విషయం ఆలస్యంగా తెలిసింది. వెంటనే కూల్చివేత పనులు ఆపేశాం' అని బదులిచ్చారు.

సివిల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ...

సినీ నటులు వెంకటేశ్, రానా, నిర్మాత సురేశ్‌బాబుకు డెక్కన్ కిచెన్ నిర్వాహకుడు నందకుమార్‌తో స్థలానికి సంబంధించిన వివాదం సివిల్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. వివాదంలోని స్థలంలో నందకుమార్ నిర్వహిస్తున్న డెక్కన్ కిచెన్ విషయంలో ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని గతంలో హైకోర్టు ఆదేశించింది. అయినా జీహెచ్‌ఎంసీ అధికారులు కిచెన్‌ను కూల్చివేశారని పేర్కొంటూ నందకుమార్ తరఫున జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్‌లోని డబ్ల్యూ3 హాస్పిటాలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ కన్నెగంటి లలిత గురువారం మరోసారి విచారణ చేపట్టారు. విచారణకు హాజరైన లోకేశ్‌ను న్యాయమూర్తి పలు ప్రశ్నలు అడిగారు.

డిప్యూటీ సిటీ ప్లానర్ కూడా కోర్టుకు రావాలి

తదుపరి విచారణకు కూడా ప్రతివాదులైన అధికారులతో పాటు డిప్యూటీ సిటీ ప్లానర్ హాజరుకావాలని ఆదేశించారు. కూల్చివేత సమయంలో తీసిన వీడియో, ఫొటోలు, ఇతర ఆధారాలు సమర్పించాలని పిటిషనర్‌కు స్పష్టం చేశారు. ఇతర ప్రతివాదులు ఉంటే వారికి కూడా నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు.

రాష్ట్రంతో అనుబంధం మర్చిపోలేనిది



- నాకు సహకరించిన వారికి కృతజ్ఞతలు
- కేసు నమోదైన రోజే పరిష్కార సమయం చెప్పాలి
- కోర్టుకు వచ్చే కక్షిదారులతో గౌరవంగా మెలగాలి
- హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్
- సీజేకు ఘనంగా వీడ్కోలు పలికిన ఫుల్‌కోర్టు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలతో అనుబంధం ఎన్నటికీ మర్చిపోలేనిదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు. వృత్తి నిర్వహణలో తనకు సహకరించిన న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, ఇతర జ్యుడీషియల్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపై వెళ్తున్న జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ను గురువారం ఫుల్ కోర్టు ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా.. ఆయన న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంట్ నుంచి సుప్రీంకోర్టు వరకు ఎలా ఎదిగారు.. ఎలాంటి కేసులు వాదించారు.. ఇచ్చిన తీర్పుల గురించి అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వివరించారు. న్యాయ ప్రపంచంలో అహంకారానికి తావులేదని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ ఒక కేసును ఎంత సమయంలో పరిష్కరిస్తుందో కాలపరిమితి తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేసు నమోదైన రోజే.. దాన్ని ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తామో కూడా చెప్పేలా న్యాయవ్యవస్థ ఉండాలని కక్షిదారులు కోరుకుంటున్నారని చెప్పారు. '95 శాతానికిపైగా కక్షిదారులు కోర్టుకు ఆందోళనతో వస్తుంటారు.. వారితో గౌరవంగా వ్యవహరించడం.. వారికి న్యాయ పరిష్కారం అందించడం మా కర్తవ్యం. న్యాయవ్యవస్థలో కీలకమైన వారిలో మొదటి భాగస్వామి కక్షిదారుడే. వారి తర్వాతే న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయమూర్తులు భాగస్వాములుగా ఉంటారు' అని పేర్కొన్నారు. జస్టిస్ నవీన్‌రావు మాట్లాడుతూ.. ఎవరినీ నొప్పించకుండా సున్నితంగా మాట్లాడే డైనమిక్ వ్యక్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, జ్యుడీషియల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలోకి ప్రజారోగ్యం!


▶ మొదటి పేజీ తరువాయి

మండిపడుతున్నారు. 'తెలంగాణలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి డాక్టర్లను తయారు చేస్తున్న తరుణంలో ఆర్‌ఎంపీ (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్), పీఎంపీ (ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్)లకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? తెలంగాణ వైద్యరంగంలో దయనీయ పరిస్థితికి ఇది ఉదాహరణ. ఇప్పటికే ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న ఆశ, ఏఎన్‌ఎం సహా ఇతర ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలను ఉపయోగించుకునే దిశగా ఎందుకు ఆలోచించడంలేదు? ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇవ్వాలని ఎందుకు అనుకుంటున్నారు? ఓటు బ్యాంకు రాజకీయాల కోసమేనా? ఆధునిక వైద్యంపై అవగాహన లేని వారికి శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం అనుమతించడం.. ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేయడమే. ఏళ్ల తరబడి ఆధునిక వైద్యం నేర్చుకున్న డాక్టర్లకు సర్కారు నిర్ణయం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది అనైతిక నిర్ణయం. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది కొరతను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోంది. దీనికి బదులు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులను నియమించాలి..' అని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఆర్‌ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లన్నింటినీ మూసివేయాలని ఐఎంఏ డిమాండ్ చేసింది.

శస్త్రచికిత్సలు చేయడంపై అభ్యంతరం...

రాష్ట్రంలో వేలాది మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఉన్నారు. అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా గ్రామీణ స్థాయి వరకు అవి అందుబాటులో లేవు. పైగా చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డాక్టర్లు నిత్యం రావడంలేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే గ్రామీణులకు ఆర్‌ఎంపీలు, పీఎంపీల వైద్య సేవలే దిక్కవుతున్నాయి. అయితే చాలామంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రాథమిక చికిత్సకే పరిమితం కాకుండా, చిన్నపాటి శస్త్రచికిత్సలు, ప్రసవాలు కూడా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అంతేగాక ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను తీసుకెళ్తూ కమీషన్లు పొందుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. మరోవైపు అనేకచోట్ల ఆర్‌ఎంపీలు, పీఎంపీల వైద్యం వికటించిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వారికి శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు ఇచ్చి, కొన్ని పరిమితులతో ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించేలా చూడాలన్నది తమ ఉద్దేశమని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రభుత్వ నిర్ణయం.. ప్రజారోగ్యాన్ని అనర్హులైన వారి చేతిలో ఉంచడమే అవుతుందని డాక్టర్లు మండిపడుతున్నారు. 'ఇది అమలైతే రోగులు ఎక్కువ సంఖ్యలో ఆర్‌ఎంపీలు, పీఎంపీల వద్దకు వెళతారు. వారు తెలిసీ తెలియని వైద్యం చేసి వికటించినప్పుడు, వారు ఆ కేసులను డాక్టర్ల వద్దకు పంపిస్తారు. కానీ అప్పటికే రోగి పరిస్థితి విషమిస్తుంది. ఆ తర్వాత ఏదైనా జరిగితే డాక్టర్లపైకే నెట్టేస్తారు..' అని అంటున్నారు. ప్రాథమిక చికిత్సకు మాత్రమే పరిమితమం కావాల్సిన వారు తమ హద్దులను దాటుతున్నారని, మందులు రాయడం వంటివి కూడా చేస్తున్నారని వివరిస్తున్నారు. ఇలాంటి వారికి శిక్షణ ఇవ్వాలనే నిర్ణయం ద్వారా ప్రభుత్వం గ్రామీణ ఆరోగ్యాన్ని పణంగా పెడుతోందని అంటున్నారు. వారికి శిక్షణ ఇవ్వాలనుకుంటే ఇక ఇన్ని మెడికల్ కాలేజీల అవసరం ఏముందంటూ తీవ్రస్థాయిలో వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ | బీఎస్.రావు కన్నుమూత



సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతిగాంచిన శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత, చైర్మన్ డాక్టర్ బొప్పన సత్యనారాయణరావు (బీఎస్ రావు) (75) గుండెపోటుతో కన్ను మూశారు. గురువారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ రోడ్ నెం 32లోని తన నివాసంలో బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆయన అక్కడే కుప్పకూలారు. వెంటనే కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. ఇటీవలే ఆయన బ్రెయిన్‌సర్జరీ చేయించుకున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణరావుకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో హఠాన్మరణం చెందారు. అంత్యక్రియల కోసం మృతదేహాన్ని విజయవాడకు తరలించారు. డాక్టర్ బీఎస్ రావు 1986లో విజయవాడ కేంద్రంగా బాలికల కళాశాల ఏర్పాటుతో శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆపై అంచెలంచెలుగా ఎదిగి, తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్, ఎంసెట్‌కు కేరాఫ్ అడ్రెస్‌గా తమ సంస్థలను తీర్చిదిద్దారు. డాక్టర్ బీఎస్ రావు 321 జూనియర్ కాలేజీలు, 322 టెక్నో స్కూళ్లు, 107 సీబీఎస్‌ఈ స్కూళ్లు స్థాపించారు.

వైద్య వృత్తి నుంచి...విద్యావేత్తగా

బీఎస్‌రావు వైద్య వృత్తి నుంచి విద్యావేత్తగా మారారు. గుంటూరు వైద్య కళాశాలలో విద్యనభ్యసించిన ఆయన ఇంగ్లండ్, ఇరాన్‌లలో 15 ఏళ్ల పాటు వైద్యుడిగా సేవలందించారు. అనంతరం తన సతీమణితో కలిసి 1986లో భారత్‌కు తిరిగి వచ్చి విజయవాడలోని పోరంకిలో బాలికల విద్యాసంస్థను స్థాపించారు. తొలుత 56 మంది విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రస్థానం మొదలైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు దాటి ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలకు చేరింది. 2006లో హిమాచల్ ప్రదేశ్, చండీగఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లో ఐఐటీ–జేఈఈ, ఏఐఈఈఈ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అమెరికా నుంచి తిరిగివచ్చిన ఆయన ఇద్దరు కుమార్తెలు విద్యాసంస్థలను దేశ వ్యాప్తంగా విస్తరించడంలో తండ్రికి తోడ్పాటు అందించారు.

దత్తాత్రేయ సంతాపం

బీఎస్ రావు మృతి బాధాకరమని, విద్యారంగానికి తీరని లోటని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. బీఎస్‌రావు మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

..మీకు ఇష్టం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

అనుమతుల పేరుతో అడ్డంకులు సృష్టిస్తోంది. జాతీయ హోదా ఇవ్వాలన్న డిమాండ్‌ను పెడచెవిన పెట్టింది. పాలమూరు పక్కనే ఉన్న కర్ణాటకలోని ఎగువభద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదాను మంజూరు చేసిన కేంద్రం, పాలమూరు రంగారెడ్డికి మొండిచేయి చూపించడం తెలంగాణ వ్యతిరేక వైఖరికి నిదర్శనం..' అని కేటీఆర్ ఆ లేఖలో ధ్వజమెత్తారు. 'కృష్ణా జలాల పంపిణీ, వినియోగంపై నాలుగు రాష్ట్రాల మధ్య ఉన్న నీటి వివాదాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కేంద్రం తాత్సారం చేస్తోంది. నీటి వినియోగ అంశం రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర జాబితాలో ఉన్నా, కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా సొంత సాగునీటి ప్రాజెక్టుల నుంచి కూడా నీరు వాడుకోలేని దుస్థితిలోకి తెలంగాణను నెట్టివేశారు. కృష్ణా నీళ్లలో 500 టీఎంసీల వాటా కావాలంటూ తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న డిమాండ్‌ను పట్టించుకోకుండా, కనీసం ట్రిబ్యునల్‌కి పంపకుండా 9 సంవత్సరాల నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది..' అని విమర్శించారు.

జిల్లా వార్తలు

ఈనెల 17న స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

సింగరేణి(కొత్తగూడెం): సికింద్రాబాద్‌లో ఈనెల 23, 24వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి జి.హన్మంతరాజు తెలిపారు. ఈమేరకు కొత్తగూడెంలోని సీఈఆర్(సింగరేణి) క్లబ్‌లో రెండు జిల్లాల స్థాయి జూనియర్, సబ్ జూనియర్ల జట్ల ఎంపికకు 17వ తేదీన పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వివరాల కోసం 98669 23395, 99080 53539 నంబర్లను సంప్రదించగలరని సూచించారు.

ఆర్యవైశ్య మహాసభ టూరిజం కమిటీ చైర్మన్‌గా కృష్ణారావు



చిన్ని కృష్ణారావు

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ టూరిజం కమిటీ చైర్మన్‌గా ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా చిన్ని కృష్ణారావును చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో పాటు ఆర్యవైశ్య మహాసభ ఖమ్మం అధ్యక్షుడు గోళ్ల రాధాకృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

గురుకుల జూనియర్ కళాశాలల్లో 15న స్పాట్ అడ్మిషన్లు


ఖమ్మం మయూరిసెంటర్/పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో వివిధ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 15న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. బాలురకు ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం కళాశాల, పుట్టకోటలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల, బాలికలకు కొత్త బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో స్పాట్ సెలక్షన్ కౌన్సెలింగ్‌ఉంటుందని పేర్కొన్నారు. అన్ని కేటగిరీల బాలురకు వివిధ కోర్సుల్లో 70, బాలికలకు 37 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సంబంధిత కళాశాలలకు ఉదయం గంటల్లోగా హాజరై ఎస్సెస్సీ గ్రేడ్ నమోదు చేయించుకుంటే మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని ఆర్‌సీఓ వివరించారు.

ఇక నిరంతరం 'సాధన'



బొజ్జాయిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

- గిరిజన ఆశ్రమ పాఠశాలకు అభ్యాస దీపికలు
- 6నుంచి 9 తరగతుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి
- ప్రతీరోజు రెండు పీరియడ్ల చొప్పున కేటాయింపు
- భద్రాచలం ఐటీడీఏ పరిధిలో వినూత్న కార్యక్రమం



విద్యార్థులకు అందజేసిన సాధన పుస్తకాలు, అభ్యాస దీపిక

ఇల్లెందు: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు కొన్నాళ్లుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. అయితే, ఈ ఫలితాలను మరింత మెరుగుపర్చడంతో పాటు వెనుకబడిన విద్యార్థులను కూడా తీర్చిదిద్దేలా భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా కనీస సామర్థ్యాలు తక్కువగా ఉన్న వారిని గుర్తించి పునఃశ్చరణతో వారిలో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. ఈమేరకు ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను అందజేసి చదివిస్తున్నారు.

రెండు జిల్లాల్లో ఆరు వేల మందికి..

భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50, ఖమ్మం జిల్లాలో పది ఆశ్రమ పాఠశాలలు, 12గురుకులాలు ఉన్నాయి. వీటిలో సుమారు ఆరు వేల మందికి నాలుగు అభ్యాస దీపిక, నిరంతర సాధన పుస్తకాలు పంపిణీ చేశారు. ఆరు నుంచి 9వ తరగతుల ప్రతీ విద్యార్థికి గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రంతో పాటు ఇంగ్లిష్ పుస్తకాలు అందజేసి అటు పాఠ్యపుస్తకాలతో పాటు వీటిని చదివిస్తున్నారు. గత ఏడాది ఈ పుస్తకాల ద్వారా మంచి ఫలితాలు రావడంతో ఈ విద్యాసంవత్సరం కూడా సమకూర్చారు. అలాగే, వీటిని చదివేందుకు ప్రతీ రోజు రెండు పీరియడ్లు కేటాయించారు. తద్వారా కనీస సామర్థ్యాలు లేని విద్యార్థులు కూడా సహచర విద్యార్థులతో సమానంగా ఎదగాలన్నదే ముఖ్య ఉద్దేశం.

సామర్థ్యాలు సాధించేందుకు..

ఐటీడీఏ భద్రాచలం పరిధిలోని గిరిజన విద్యార్థులకు అందజేసిన నిరంతర సాధన, అభ్యాస దీపికల ద్వారా నాణ్యమైన విద్య అందడమే కాక పిల్లలతోసామర్థ్యాలు మెరుగవుతున్నాయని చెబుతున్నారు. కరోనా కాలంలో చాలా మంది విద్యార్థుల్లో పుస్తక పఠనం తగ్గింది. అలాంటి వారికి ఈ పుస్తకాలతో ఉపయోగముంటుందని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించాయి. ప్రాథమిక స్థాయి మొదలు కనీస స్థాయి వరకు నేర్చుకునేలా ఈ పుస్తకాలు రూపొందించగా, ఉపాధ్యాయుల సహకారం లేకుండా పిల్లలు సొంతంగానే చదువుకునే అవకాశముంటుంది.

పదో తరగతి వారికి కూడా...

ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం, పదో తరగతిలో కేవలం తెలుగు మీడియం బోధన మాత్రమే సాగుతోంది. కానీ యూ డైస్‌లో తప్పిదాల కారణంగా ఈసారి పదో తరగతి విద్యార్థులకు కూడా ఇంగ్లిష్ మీడియం పాఠ్యపుస్తకాలే వచ్చాయి. దీంతో వీటిని వెనక్కి పంపించి.. గత ఏడాది పదో తరగతి పూర్తి చేసిన వారి నుంచి సేకరించిన పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చారు. కానీ అందరికీ పుస్తకాలు సరిపోకపోవడంతో వీరి కోసం ప్రత్యేకంగా అభ్యాస దీపికలను రూపొందించి అందజేశారు. దీంతో పదో తరగతి విద్యార్థులు కూడా అభ్యాస దీపికల ఆధారంగా చదువుకుంటున్నారు.

ఎంతో ఉపయోగం..



గత ఏడాది నుంచి అభ్యాస దీపికలు అందజేస్తున్నారు. మాకు సాధన పుస్తకాలు కూడా ఇచ్చారు. వీటిని సొంతంగానే చదువుకుంటున్నా చక్కగా అర్థమవుతోంది. ప్రభుత్వమే వీటిని తయారుచేసి మాకు అందించడం ఎంతో ఆనందంగా ఉంది.

– వట్టం రిషి, 6వ తరగతి, బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల, ఇల్లెందు మండలం

ప్రైవేట్ స్కూల్‌లో వర్క్‌బుక్‌ల మాదిరి



ప్రైవేట్ పాఠశాలల్లో వర్క్‌బుక్స్ కొనుగోలు చేయిస్తారు. కానీ భద్రాచలం అధికారులు ప్రత్యేక శ్రద్ధతో సాధన, అభ్యాస దీపిక పుస్తకాలు అందిస్తోంది. వీటివల్ల వెనుకబడిన విద్యార్థులు కూడా కనీస సామర్థ్యాలు సాధిస్తుండడంతో మంచిమార్కులు వస్తున్నాయి.

– జి.కృష్ణ, తెలుగు ఉపాధ్యాయుడు, బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల

విద్యార్థుల సామర్థ్యాలు పెరిగేలా...



గిరిజన విద్యాసంస్థల్లోని పిల్లల సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తున్నాం. ఐటీడీఏ పీఓ ఆదేశాలతో ప్రాజెక్టు మానిటరింగ్ రీసెర్చ్ సెల్ ద్వారా సాధన, అభ్యాస దీపికలు అందజేశాం. చదువులో వెనుకబడిన వారిని అందరితో సమానంగా తీర్చిదిద్దేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి.

– రూపాదేవి, ఏటీడీఏఓ, ఇల్లెందు

ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు కృషి



విలేజ్ బస్ ఆఫీసర్ల శిక్షణలో మాట్లాడుతున్న సోలమన్

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీకి ప్రయాణికులను దగ్గర చేయడం ద్వారా లాభాల బాట పట్టించేందుకు వినూత్న పథకాలు అమలుచేస్తున్నట్లు ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సోలమన్ తెలిపారు. ఇందులో భాగంగా మార్కెటింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల విలేజ్ బస్ ఆఫీసర్లుగా నియమితులైన ఉమ్మడి జిల్లాలోని 143మందికి ఖమ్మం కొత్త బస్టాండ్‌లో గురువారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సోలమన్ మాట్లాడుతూ విలేజ్ బస్ ఆఫీసర్లు కేటాయించిన గ్రామాలు, వార్డుల్లో ప్రతి నిధులు, ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ సంస్థ పథకాలను వివరించాలని సూచించారు. ఇన్‌చార్జి ఆర్‌ఎం బి.ప్రసాద్, ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్, అధికారులు రామయ్య, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఏ సమస్యా పెండింగ్‌లో ఉండొద్దు..

అధికారులతో సమీక్షలో ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు



డీడీ కార్యాలయ ఉద్యోగులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ గౌతమ్

భద్రాచలం: గిరిజనులకు సంబంధించి ఏ దరఖాస్తు, వినతిపత్రం కూడా పెండింగ్‌లో ఉండకుండా పరిష్కరించాలని, ఈ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రు హెచ్చరించారు. ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఆయన డీడీ కార్యాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు ఫైళ్లను పరిశీలించాక పీఓ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యాన్ని విడనాడి ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ(జనరల్), ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్, అధికారులు రమణయ్య, ప్రమీల బాయి, కృష్ణారెడ్డి, నారాయణ, రంగయ్య, రమణమూర్తి, ప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధికి కృషి..

గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఐటీడీఏ కృషి చేస్తోందని ఏపీఓ(జనరల్) డేవిడ్‌రాజ్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వచ్చిన సభ్యుల బృందంతో ఐటీడీఏలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిజనుల స్థితిగతులు, వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను వివరించారు. కాగా, ఈ బృందం పర్యటన మూడు రోజుల పాటు దుమ్ముగూడెం మండలంలో ఉంటుందని తెలిపారు. ఈసమావేశంలో దుమ్ముగూడెం ఎంపీడీఓ ముత్యాలరావు, ఓయూ బృందం సభ్యులు గణేష్, వందన పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం

మాజీ ఎంపీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పొంగులేటి



జీపీ కార్మికుల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

గార్ల: రాష్ట్రంలో మరికొన్ని నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని.. అప్పుడు తప్పకుండా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని మహబూబాబాద్ జిల్లా గార్లలో గురువారం సందర్శించిన ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందని తెలిపారు. నియంత, కుటుంబ పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఎనిమిది రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా.. కేసీఆర్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. కాగా, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల అరాచకాలు పెట్రేగిపోతున్నాయని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆయనను పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, నాయకులు దనియాకుల రామారావు, తాళ్లపల్లి కృష్ణగౌడ్, గుండా వెంకట్‌రెడ్డి, వెంకట్‌లాల్, రాజకుమారి, నాగేశ్వరరావు, శంషాద్ బేగం, మీరాపఠాన్, భిక్షపతి, సుందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పంచుకున్నారు.. పోషణ మరిచారు

కారేపల్లి: కని పెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆదరించని కుమారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు హెచ్చరించారు. మండలంలోని జైత్రాతండాకు చెందిన 65 ఏళ్ల ధరావత్ సూర్య వ్యవసాయ భూమిని కుమారులు రమేష్, నరేష్ పంచుకున్నారు. అయితే, సూర్యకు ఒక కాలు, చేయి లేకపోగా కుమారులు ఆదరించకపోవడంతో భిక్షాటన చేయాల్సి వస్తోందని ఎస్‌ఐ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన జైత్రాంతండా గ్రామానికి వెళ్లి సర్పంచ్ లక్ష్మణ్, గ్రామ పెద్దల సమక్షాన కుమారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రుల ఆలనాపాలన పిల్లల నైతిక బాధ్యత అని హితవు పలికారు. అలాగే, చీమలపాడులో కల్లోజి అచ్చమ్మను ఆమె మనమరాలు సరిగ్గా చూసుకోవడం లేదని ఫిర్యాదు చేయగా కౌన్సెలింగ్ ఇచ్చి ఇక నుంచి మంచిగా చూసుకోవాలని సూచించారు.